

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 సంచిక : 12 ఆగష్టు 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


చించినాడ .......... 10-05-08

మల్కిపురం .......... 18-05-08

గణపవరం .......... 29-05-08



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 10-05-08, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శంకరజయంతి. మొదటి ఆచార్యుడు శంకరుడు, ఆయన విద్యాస్వరూపుడు, అనుగ్రహస్వరూపుడు, తేజోమయుడు, మహిమాన్వితుడు. శంకరుడు కర్ణాటకలోని కాలిడి గ్రామంలో శరీరం తీసుకొన్నాడు. శంకరుడి తల్లి ఆర్యాంబ, తండ్రి శివగురువు. వారికి చాలాకాలం సంతానం లేదు. ఒక బిడ్డను ప్రసాదించమని శివాలయానికి వెళ్ళి ప్రార్థిస్తూ ఉండేవారు. ఒకనాడు శివగురువుకి శివుడు దర్శనమిచ్చి నీకు బిడ్డ కావాలి అంటున్నావు సామాన్యుడిగా ఉండి దీర్ఘకాలం జీవించేవాడు కావాలా? లేక సర్వజ్ఞుడై తక్కువ కాలం జీవించేవాడు కావాలా? అని అడుగుతాడు. దీర్ఘకాలం జీవించటం ఎందుకు తక్కువకాలం జీవించినా సర్వజ్ఞుడే కావాలని శివగురువు చెపుతాడు. అప్పుడు శివుడే శంకరుడిగా వచ్చాడు. మనకు సంబంధించినంతవరకు గురు పరంపరలో దక్షిణామూర్తి, శంకరుడు, రమణుడు. దక్షిణామూర్తి ఒక్కమాట మాట్లాడలేదు, పూర్తిగా మౌనం. ఆ మౌనభాష అర్థం చేసుకోగలిగినవారే ఆయన దగ్గరకు వెళ్ళారు. శంకరాచార్యులవారి టైము వచ్చేటప్పటికి మౌనం విడిచిపెట్టేసారు, కాల ప్రవాహాన్నిబట్టి ఆయన చెప్పటం, వ్రాయటం, అనుగ్రహించటం. ఆయన కాలి నడకన భారతదేశాన్ని 3సార్లు చుట్టి బోధించారు. రమణుడిది దక్షిణామూర్తి పద్ధతికాదు, శంకరుడి పద్ధతీ కాదు. రమణుడు అటుఇటు కాకుండా కొంతవరకు మౌనంగా ఉండేవారు, అవసరమైనప్పుడు మాటలు చెప్పేవారు, ఆయనలో కొంతభాగం, ఈయనలో కొంతభాగం తీసుకొని రమణుడు వచ్చాడు.

శంకరుడికి 5వ సంవత్సరంలో తండ్రి స్వర్గస్థులయ్యారు. ఆయనకు 8 సంవత్సరాలు వచ్చేటప్పటికి వేదాలు, ఉపనిషత్‌లు అన్నీ చదవటం అయిపోయినాయి. శంకరుడికి గృహపరిత్యాగం చేసే టైము వచ్చింది. సన్యాసం తీసుకోవటానికి తల్లి అనుమతి అడిగాడు. తల్లి అంగీకరించలేదు. ఒకరోజు ఆయన పూర్ణానదిలో స్నానం చేస్తూ ఉండగా తల్లి గట్టుమీద కూర్చొంది. ఒక దొంగ మొసలి వచ్చి ఆయన కాలును పట్టుకొని లాగేయటం, గట్టు మీద నుండి తల్లి కేకలు వేయటం, అప్పుడు నేను సన్యాసం తీసుకోవటానికి నువ్వు అంగీకరిస్తేనే మొసలి వదిలిపెడుతుంది అని శంకరుడు తల్లితో చెప్పటం, తల్లి దానికి అంగీకరించటం అప్పుడు మొసలి విడిచిపెట్టిపోవటం జరిగింది, ఇది అంతా మాయ. ఆశ్చర్యం ఏమిటి అంటే ఒడ్డుకు వచ్చిన తరువాత ఆయన ఇంటికి వెళ్ళలేదు. జ్ఞాతులను పిలిచి తల్లిని జాగ్రత్తగా చూసుకొంటూ ఆస్తిని వారిని తినమని చెప్పాడు. నువ్వు చెప్పేది బాగానే ఉంది కాని నా శరీరం చనిపోయినప్పుడు నువ్వు వచ్చి కర్మకాండ చేయమని తల్లి అడిగింది. అది శంకరుడికి న్యాయం అనిపించింది. నీ శరీరానికి అవసాన కాలం వచ్చినప్పుడు శంకరా, శంకరా అని నన్ను స్మరించు నేను ఎక్కడ ఉన్నా వస్తాను అని తల్లికి చెప్పాడు. ఆయన గోవింద భగవత్‌పాదుల దగ్గర సన్యాసం పుచ్చుకొన్నారు. ఆయన అనేక గ్రంథాలు వ్రాసారు. ఆయన చెప్పినది ఏమిటి అంటే ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం, అది తప్పించి అంతా మాయే. నీకు తెలుసున్నా నీవు బ్రహ్మమే, నీకు తెలియకపోయినా నీవు బ్రహ్మమే. ఆ బ్రహ్మానుభవం కలిగేవరకూ ఏ జీవుడిని మాయ విడిచిపెట్టదు. బ్రహ్మంకు భిన్నంగా నీవు ఏది చూసినా అది అంతా మాయే. బ్రహ్మానుభవం ఎలా పొందాలి అనేదే ఆయన గ్రంథాలలో వివరించారు, వాడు శంకరుడు. బ్రహ్మానుభవం పొందకుండా నీ శరీరం శవం అయిపోతే నీవు పొందే నష్టం ఇట్టిది అని ఎవరూ చెప్పలేరు అంటే అంత నష్టానికి గురి అవుతావు.

మీకు ఎప్పుడైనా కోపం వస్తుంది, దుఃఖం వస్తుంది, గర్వం వస్తుంది, రకరకాల గుణాలు వస్తాయి, అక్కడ ఆగిపోకూడదు. బ్రహ్మజ్ఞానం పొందటానికి నీవు ప్రయత్నం చేసేటప్పుడు అనేక ఆటంకాలు వస్తాయి, ఆర్థిక ఇబ్బందులు రావచ్చు, ఇంట్లోవారు శత్రువులు అవ్వవచ్చు, అనేకరకాల ఇబ్బందులు రావచ్చు, వీటన్నింటిని తట్టుకోగల శక్తి ఉంటేనే, అంత సహనం ఉంటేనే నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది కాని ఇది పాండిత్యంవలన, ధనంవలన వచ్చేదికాదు. గురువుగారు ఆచార్యులవారిని కాశీ వెళ్ళమని చెప్పారు, ఆయన కాశీ వెళ్ళారు. ఆయన ప్రచారం చేసినది అద్వైతం అంటే ద్వితీయం లేనిది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే రెండవది లేదు. మనం ద్వైతంలో నుండి ఎంతకాలం అయితే బయటకు రాలేమో అంతకాలం

మనకు భయం తప్పదు, కోరిక తప్పదు, కోపం తప్పదు, పునర్జన్మలు తప్పవు. నువ్వు జ్ఞాన మార్గంలో అయినా తరించవచ్చు, కర్మమార్గంలో అయినా తరించవచ్చు. కర్మయోగి అంటే వాడికి స్వార్థప్రేరితంగా ఆలోచనరాదు, స్వార్థప్రేరితంగా పనిచేయడు, వాడు కర్మయోగి. మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే బాహ్యంగా మీరు మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. చిత్తశుద్ధి లేకుండా జ్ఞానం రాదు. కోరికతోటి, కోపంతోటి, పబ్లిసిటీతోటి సంబంధం లేకుండా పని పనికోసమే చేసేవాడికి చిత్తశుద్ధి కలుగుతుంది. పుణ్యం చేసినవాడు నేను పుణ్యం చేసాను అనుకొంటాడు, పాపం చేసినవాడు నేను పాపం చేసాను అనుకొంటాడు, అలా ఎవరు అనుకొంటున్నారు, అలా అనేది వాడి అహంకారం, ఇంకవాడు మాయలో నుండి బయటకు రాలేడు, ఇది మహామాయ.

కలియుగంలో మాయ ఎక్కువగా ఉంటుంది. ఎర్రబట్టలు కట్టుకొనేవాడు ప్రతీవాడు గురువు అయిపోవాలి అనుకొంటున్నాడు. నేను సన్యాసిని, నేను గురువును, నేను ఉపనిషత్‌లు చెపుతాను అంటాడు. కాని అందరం ఎక్కడ మిస్సైపోతున్నాము అంటే హృదయంలో ఒక సత్యం ఉంది, దాని తాలుక అనుభవం మనకు లేదు, అది పొందటానికి కనీసం ప్రయత్నం కూడా చేయటం లేదు, దాని కోసం ప్రయత్నం చేయాలనే బుద్ధికూడా మనకు రావటం లేదు, పెద్దపెద్ద స్వాములు కూడా అలాగే ఉంటున్నారు. ఇదంతా ఎందుకు చెపుతున్నాను అంటే లోపల ఉన్న వస్తువును తెలుసుకోవాలి అని సన్యాసులు మరిచిపోయారు, మనం కూడా మరిచిపోయాము, అసలు గమ్యం పూర్తిగా వదిలేసాము. మీరు ఆ యజ్ఞం చేయండి మీ కోరిక నెరవేరుతుంది అని స్వాములు చెపుతున్నారు, మనం దాని గురించి లక్షలలో డబ్బు ఖర్చుపెడుతున్నాము, వాటి ద్వారా సంపాదన కోసం వారు చూస్తున్నారు. ఆచార్యులవారు చెప్పింది ఏమిటి అంటే మీరు బట్టకోసం, పొట్టకోసం ప్రజల మీద ఆధారపడవచ్చు కాని వారి దగ్గర నుండి మిగతావి ఏమీ ఆశించవద్దు, వారికి ధర్మాన్ని, జ్ఞానాన్ని బోధించండి అని చెప్పారు, దాని కోసమే ఆయన పీఠాలు స్థాపించారు. శంకరుడికి 16 సంవత్సరాలు వచ్చేటప్పటికి ఆయన ఆయుష్షు అయిపోయింది. అప్పటికే ఆయన రచనలు చేసారు. ఆ రచనలు నీవు దేశం అంతా తిరిగి ప్రచారం చెయ్యాలికదా, దేశం అంతా తిరిగి ప్రచారం చెయ్యటానికి ఇంకో 16 సంవత్సరాలు వయస్సు పెంచారు. మొత్తం శంకరుడు ఈ భూమి మీద ఉన్నది 32 సంవత్సరాలే. ఈ 32 సంవత్సరాలలో ఆయన మూడుసార్లు దేశం అంతా తిరిగి భోదించారు. ఆయన చెప్పిన ముఖ్యమైన విషయం ఏమిటి అంటే ద్వితీయం ఉన్నంతకాలం

భయం తప్పదు. నీకంటే వేరుగా ఏది కనిపించినా నీకు భయం వస్తుంది. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అదే నీకు లోకం అంతా కనిపిస్తుంది. లోపల ఉన్నదే బయట ఉంది. బయట ఉన్నదే లోపల ఉంది, అంతా ఒక్కటి అంటే ఒక్కటే అని నీకు తెలుస్తుంది. అప్పుడు భయం లేదు, కోరిక లేదు, కోపం లేదు, పునర్జన్మ లేదు, అదే చివరి స్థితి, అక్కడకు తీసుకొనివెళ్ళాడు, వాడు శంకరుడు.

మీరు చెడ్డగుణాలు తగ్గించుకోండి, మంచి గుణాలను పెంచుకోండి అని చెప్పటం దేనికి అంటే మంచి గుణాలు లేకపోతే మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. ఒకసారి ఏసుక్రీస్తు దగ్గర ఆయన ఇన్నర్ సర్కిల్ 12 మంది కూర్చొన్నారు. అక్కడికి వచ్చినవారు ఏమన్నారు అంటే ఈ రోజు ఉపవాసం చేసేరోజు, మీరు ఉపవాసం చేయటం లేదు ఏమిటి అని అక్కడ ఉన్న భక్తులను అడిగారు, వారు ఏమీ మాట్లాడలేదు. ఏసుక్రీస్తు ఏమన్నారు అంటే పెళ్ళివారి ఇంటికి వెళ్ళి అక్కడ ఉన్నవారిని ఉపవాసం చెయ్యమంటే ఎలాగ ఉంటుందో ఇప్పుడు మీరు చెప్పేమాటలు అలాగే ఉన్నాయి అన్నారు. అంటే దాని అర్థం ఏమిటి అంటే పెళ్ళివారి ఇంటి దగ్గర ఉపవాసాలు ఎందుకు అలాగే అవతారపురుషుడి ఎదురుగా కూర్చొని వారికి ఉపవాసాలు ఎందుకు? అని చెప్పటం. ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉండేవారు. వాళ్ళ అన్నగారు చనిపోయాడు. అన్నగారు అంటే వారికి చాలా ఇష్టం. ఒకసారి కాకతాళీయంగా ఏసు వారింటికి వెళ్ళాడు. ఆ అక్కాచెల్లెళ్ళు మా అన్నయ్య చనిపోయాడండి అని చెప్పి ఏడుస్తారు, మీతోపాటు నేను ఏడుస్తాను అని చెప్పి ఆయన కొంతసేపు ఏడుస్తాడు. తరువాత మీ అన్నగారి సమాధి దగ్గరకు తీసుకొని వెళ్ళమని అడుగుతాడు. వారి దుఃఖం చూసి ఏసు ఏమన్నాడు అంటే ఓ లజారస్, లజారస్ నువ్వు లోపల నుండి బయటకు రా అంటాడు, ఆయన బయటకు వస్తాడు. అప్పుడు ఏసు ఏమని చెప్పాడు అంటే చనిపోయిన వారిని బతికించటం నాకు ఉద్యోగం కాదు. మీ దుఃఖం భరించలేక నేనూ ఏడ్చాను, అయినా నాకు తృప్తి అవ్వటం లేదు అందుచేత మీ అన్నయ్యని మీకు ఇచ్చేస్తున్నాను అని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు, వాడు ఏసు. లోపల ఉన్న సత్యానికి అత్యంత సమీపంలో ఉండేది సత్వగుణం, మిగతా గుణాలు స్వరూపానికి దూరంగా ఉంటాయి. ఏ గుణం అయితే సత్యానికి దగ్గరగా ఉంటుందో ఆ గుణాన్ని ఆశ్రయించి, ఆ గుణాన్ని పెంచుకొని సత్య పదార్థాన్ని పొందాలి.

శంకరుడు విద్యాస్వరూపుడు, ఆయనకు లోపలఉన్న సత్యవస్తువు తాలుక అనుభవం ఉంది. ఆయనకు చదువు అంటే ఇష్టం అలా గంటల తరబడి బోధించేవాడు. అనుభవం

ఉండటం, దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పగలగటం, చెప్పటానికి తగిన భాష ఇవి మూడూ ఉండటం కష్టం. ఇవి మూడూ ఉన్నవాడే శంకరుడు. వారు చెప్పిన మాటలు చదివేటప్పుడు అవి మనకు అబద్ధం కింద అనిపిస్తాయి ఎందుచేతనంటే జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలు, అలవాట్లు ఆ మంచిమాటలను నమ్మనివ్వవు. ద్వైతకర్మ జీవుడిని బంధిస్తుంది. అద్వైతకర్మ జీవుడిని బంధించదు. ఇతరులకు ఎవరికైనా సహాయం చేస్తే నేను వాడికి ఉపకారం చేసాను, నేను మంచి చేసాను అంటావు, అది ద్వైతకర్మ. మనం చేసేవి ద్వైతకర్మలు. నీకు నువ్వు ఎలాగ చేసుకొంటావో అలాగే ఇతరులకు కూడా చేయగలగాలి, అది అద్వైతకర్మ. ద్వైతకర్మలో ఉన్నంతసేపు నీవు బంధింపబడి తీరతావు, దీనిని ఎవరూ ఆపలేరు. లోపల మనస్సు ఉన్నంతసేపు మీరు అనుకోవటం మానరు, కర్మ చుట్టుకోవటం మానదు, ద్వైతం వచ్చాక పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం చుట్టుకొంటుంది. అమావాస్యరోజున మనకు చంద్రుడు కనబడడు అలాగని చంద్రుడు లేడు అని కాదు, మనకు కనబడటం లేదు అంతే. అలాగే మనలో జ్ఞానసూర్యుడు ఉన్నాడు. మనలో అజ్ఞానం ఉన్నంత కాలం లోపల ఆయన ఉన్నా మనకు గోచరంకాడు. జీవిత లక్ష్యం ఒక్కటే మనం ఏదో సాధన ద్వారా మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీకున్న సర్వశక్తులను, అవకాశములను కేంద్రీకరించి అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నించు, మనం ఈ భూమి మీదకు వచ్చినపని అదే, వచ్చిన పని మరిచిపోవద్దు. ఇతరులను జయించటంకంటే మీ మనస్సును మీరు జయించటం కష్టం. ఇతరులకు మంచి చేయటంకంటే మీ మనస్సును మీరు నిగ్రహించుకోవటం కష్టం. బయట ఉన్న రాక్షసులను చంపటం తేలిక కాని లోపల ఉన్న రాక్షసులను చంపటం కష్టం. మీ లోపల అజ్ఞానరూపంలో రాక్షసులు ఉన్నారు. లోపల రాక్షసుల బారి నుండి మనం ఎలా బయట పడాలో నేర్పినవారే దక్షిణామూర్తి, శంకరుడు, రమణుడు మొదలగువారు. మనకు సన్మార్గం చూపించారు కాబట్టి వారు మహాత్ములు, వారు కూడా అవతారపురుషులే.

మన శరీరానికి ఏదైనా రోగం వస్తే బాధపడతాము, మనస్సులో బెంగవస్తే బాధపడతాము. వీటి అన్నింటికంటే మమకారం మనలను ఎక్కువ బాధ పెడుతుంది. అది తెలియక మనం బయట వారిని తిడుతూ ఉంటాము. తలంపులు మమ్మల్ని ఎక్కువగా బాధ పెడుతున్నాయి అని అడుగుతున్నారు. జీవితం అంతా తలంపులే. శరీరానికి సంబంధించిన చావు, పుట్టుక, నీ సంతోషం, దుఃఖం, నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అని అనుకోవటం ఇవి అన్నీ తలంపులే. ఒక్క బ్రహ్మం తప్పించి ప్రతీదీ తలంపే. మనం ఏమి చెయ్యాలి అంటే ఆత్మలో మన మనస్సును

నిలబెట్టి ఉంచితే, దానియందు నీకు ప్రీతి కలిగితే ఈ తలంపులు అన్నీ పోతాయి. బ్రహ్మం యొక్క విలువ మనకు తెలిస్తే మనస్సు అక్కడకు వెళ్లి వాలుతుంది. బ్రహ్మం యొక్క విలువ మనకు తెలియటంలేదు, బ్రహ్మానుభవం పొందితే మనం మాయలోనుండి బయటకు వచ్చేస్తాము అన్న సంగతి మనకు తెలియటం లేదు. అందుచేత మనం పనికిరానివి అన్నీ పట్టుకొంటున్నాము, అసలు వస్తువును మిస్ అయిపోతున్నాము. అది మిస్ అవ్వకుండా ఉండటంకోసం, బ్రహ్మం యొక్క విలువ మనకు తెలియజేయటం కోసం శంకరుడు అనేక గ్రంథాలు వ్రాసాడు, రోజుల తరబడి సబ్జక్టు భోదించాడు.

మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా న్యూట్రల్‌గా ఉండటం నేర్చుకోండి. అప్పుడు మీరు సమానంగా ఉండగలిగితే మీకు లోపలకు వెళ్లేదారి కనబడుతుంది. సృష్టి అంతా భగవంతుడే వ్యాపించి ఉంటే ఇంక నువ్వు సంతోషించేది దేనికి, దుఃఖపడేది దేనికి? సత్యవస్తువు ఎలా ఉండాలో అలా ఉంది, దానికి తలంపులు లేవు. అందుచేత దాని గురించి ఊహించవద్దు, అది ఎలా ఉందో అలా ఉండటానికి ప్రయత్నం చెయ్యి, అది అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. ఒకో తలంపును మీరు గెంటుకోవాలన్నా అది వెళ్లదు, అదే తలంపు వచ్చేస్తోంది ఏమిటి అని మీరు అనుకొంటారు దీనికి ఉపాయం ఒకటి ఉంది. మీకు ఇష్టమైన దేవతారూపాన్ని లేక గురువును తీసుకొని దానిమీద మీరు బాగా ఇష్టాన్ని పెంచుకోండి. ఆ దేవతాపురుషుడి రూపాన్ని లేక గురువు రూపాన్ని ధ్యానించుకోండి, ఆయన నామాన్ని స్మరించుకోండి, ఆ కళ్యాణగుణాలను మననం చేసుకోండి, అప్పుడు మీ రూపం నుండి, నామం నుండి నెమ్మదిగా బయటకు వచ్చేస్తారు, అప్పుడు తలంపులు రావటం తగ్గిపోతాయి. అయితే ఒకటి గుర్తు పెట్టుకోండి. మీ ఇష్ట దైవం మీద లేక గురువు మీద మీకు మినహాయింపులు లేని శరణాగతి ఉండాలి. ఆయన ఇష్టమే నా ఇష్టం, ఆయన సంకల్పమే నా సంకల్పం అని మీరు అనుకొంటే అప్పుడు ఇతర తలంపులు రావు సరికదా మనస్సు నెమ్మదిగా అణిగిపోతుంది, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అయితే ఆ దేవతా పురుషుడిమీద, గురువు మీద మీకు పరిపూర్ణమైన నమ్మకం ఉండాలి. వాడు మనలను రక్షిస్తాడు, మన రక్షకుడు వాడే అనేటువంటి విశ్వాసం ఉండాలి. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. దేవతాపురుషుడి మీద మీకు ఇష్టం ఉంటే ఎంతసేపు ఆ నామాన్ని స్మరించినా మీకు కష్టం అనిపించదు. అందుచేత మనకు ఎంత కష్టమైన పని అయినా ఇష్టంగా చేస్తే కష్టం కింద అనిపించదు. మనం ఇతరుల గొడవలలోనికి వెళ్లకూడదు. ఇతరుల గొడవలలోనికి వెళితే మనకు తెలియకుండా మనస్సు పెరిగిపోతుంది, మనం దేనినైతే వదిలించుకోవాలి

అనుకొంటున్నామో అది పెరిగిపోతుంది, అది పెరిగిపోతూ ఉంటే తలంపులు కూడా పెరిగిపోతాయి.

శరీరానికి వచ్చే రోగాలకంటే, ప్రకృతి తీసుకొనివచ్చే ఇబ్బందులకంటే, సమాజం తీసుకొని వచ్చే గొడవలకంటే అన్నింటికంటే మన మమకారమే మనలను ఎక్కువ బాధపెడుతుంది. మమకారం మనలను బాధపెట్టినట్లుగా ప్రపంచంలో ఏదీ మనలను బాధపెట్టదు. మీ చెయ్యి నిప్ప మీద పెడితే దాని యొక్క మంట ఎలా ఉంటుందో అలాగే మమకారం ఉంటే మనస్సుకు అంతమంట పుడుతుంది. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన ఈ మూడువాసనలు మనిషిని పట్టుకొని పీడిస్తున్నాయి. ఎవడైతే ధైర్యంతోటి ఈ మూడు వాసనలను విడిచిపెట్టగలిగాడో, ఈ మూడువాసనలను త్యాగం చేయగలిగాడో వాడు ఆత్మనిష్టుడు అవుతాడు. నీ కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచంలో నువ్వు సంతోషించటానికి ఏమీ లేదు, దుఃఖపడటానికి ఏమీ లేదు నువ్వే కల్పించుకొని సంతోషిస్తున్నావు, కల్పించుకొని దుఃఖపడుతున్నావు, ఇవన్నీ నీ తలంపులే అన్నారు ఆచార్యులవారు. శంకరాచార్యులవారు గంటల తరబడి సబ్జక్టు బోధించేవారు దానికి కారణం ఏమిటి అంటే మీకు సబ్జక్టు మీద ప్రీతి కలగాలి. మీకు దాని మీద ఇష్టం కలిగితే దానిని పొందటానికి మీరే ప్రయత్నం చేస్తారు. మీకు సబ్జక్టు ముఖ్యం, ఆలోచన ముఖ్యం, మిగతా గొడవలు అనవసరం. మనం పెద్దవారిని మరిచిపోతున్నాము. మనం మహాత్ములను జ్ఞాపకం పెట్టుకోవాలి. శంకరుడు, రమణుడు వీరిని స్మరించుకోవటం పుణ్యం, వారిని జ్ఞాపకం పెట్టుకోవటం పుణ్యం, వారికి నమస్కారం పెట్టుకోవటం పుణ్యం. శంకరుడు, రమణుడు, దక్షిణామూర్తి ఏది చెప్పినా దాని తాలుక అనుభవం పొంది, లోపల ఆ వస్తువును దర్శించే చెప్పారు కాని ఏదో మనలను సంతోష పెట్టటానికి, మన అహంకారాన్ని ఉబ్బించటానికి చెప్పిన మాటలు కాదు, వారు పొందిన అనుభవాన్ని మనకు అందించారు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-05-08, మల్కిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గౌతమబుద్ధుడు పుట్టినరోజు, ఆయనకు జ్ఞానం వచ్చినరోజు, ఆయన శరీరం విడిచిపెట్టినరోజు ఒకటేరోజు. వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున ఆయన శరీరం పుట్టింది, మరల అదేరోజున ఆయనకు జ్ఞానం కలిగింది, ఆయన శరీరం విడిచిపెట్టిన రోజు కూడా వైశాఖశుద్ధ పౌర్ణమియే. ఈ భూమి మీద మనుషులు పుట్టటం ప్రారంభించాక బుద్ధుడులాంటి పెద్దమనిషి,